# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ సర్వమానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన ఏసుక్రీస్తు జన్మదినం ప్రపంచానికి పండుగ రోజు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ తిరుమలలో జనవరి 10, 11, 12వ తేదీలకు వైకుంఠ ద్వార దర్శనాలకై లక్షా 20 వేల టోకెన్లను జారీ చేస్తామని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు వెల్లడించారు.
- ❖ అధికారంలోకి వచ్చిన ఐదు నెలలలోనే హామీలు నెరవేరుస్తూ... అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేశామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- ❖ దేశంలో టెలీకమ్యూనికేషన్స్ అభివృద్ధి, మొబైల్ టెక్నాలజీ విస్తరణకు పూర్వ ప్రధానమంత్రి అటల్ బీహారి వాజ్‌పేయ్ నాంది పలికారని మిజోరామ్ రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు.
- ❖ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలో పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం వెల్లడించింది.

==========================

సర్వమానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన ఏసుక్రీస్తు జన్మదినం ప్రపంచానికి పండుగ రోజు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. క్రిస్టమస్ సందర్భంగా క్రైస్తవులకు సామాజిక మాధ్యమ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు మార్గంలో నడుస్తూ... ప్రేమ, కరుణ, సహనం, దయ, త్యాగ గుణాలను అలవాటు చేసుకుని, సర్వమానవాళికి మేలు కలగాలని ప్రభువును ప్రార్థిద్దామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనగల నారాయణరావు కృష్ణ జిల్లా, మచిలీపట్నం తెలుగు చర్చిలో నిర్వహించిన క్రిస్టమస్ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... ప్రేమ, కరుణతో జీవితాన్ని శాంతిమయం చేసుకుందామని పేర్కొన్నారు. మైనార్టీలు, క్రిస్టియన్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి

ఉందని ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. క్రైస్తవుల ఆర్థికాభివృద్ధికి స్వయం ఉపాధి రుణాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

=========================

తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనాలకు జనవరి 10, 11, 12వ తేదీలకు సంబంధించి లక్షా 20 వేల టోకెన్లను జారీ చేస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యనిర్వహణ అధికారి జె.శ్యామలరావు వెల్లడించారు. వైకుంఠ ద్వారా దర్శనాలకు సంబంధించి శ్రీ వారి సర్వ దర్శనం సమయ నిర్దేశిత టోకెన్ల జారీ కౌంటర్లలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన ఈరోజు జిల్లా కలెక్టర్ వెంకటేష్, ఎస్పీ సుబ్బారాయుడుతో కలిసి పరిశీలించారు. టోకెన్ల జారీ ఏర్పాట్లను త్వరిత గతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఈఓ అక్కడి అధికారాలను ఆదేశించారు. అనంతరం శ్యామల రావు పాత్రికేయులతో మాట్లాడుతూ... జనవరి 10 నుంచి 19వ తేది వరకు భక్తులకు వైకుంఠ ద్వారా దర్శనాలను కల్పిస్తామని, జనవరి 8వ తేదీ ఉదయం 6 గంటల నుంచి టోకెన్ల జారీ ప్రక్రియ ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. టోకెన్ల జారీ చేసేందుకు తిరుపతి, తిరుమలలో 9 కేంద్రాలలో 91 కౌంటర్లు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

=========================

విజయవాడలో ప్రస్తుతం జరుగుతున్న భవానీ దీక్షా విరమణ కార్యక్రమంలో ఈసారి తప్పిపోయిన చిన్నారుల జాడను గుర్తించేందుకు QR కోడెడ్ రెస్ట్ బ్యాండ్ - చైల్డ్ - ట్యాగ్ సాంకేతికతను ఎన్టీఆర్ జిల్లా అధికారులు విజయవంతంగా వినియోగిస్తున్నారు. ఈ విధానంతో ఇప్పటి వరకు తప్పిపోయిన 10 మంది పిల్లలను కనుగొని వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కనకదుర్గమ్మ ఆలయాన్ని సందర్శించడానికి వచ్చే 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న చిన్నారులకు ఈ QR కోడెడ్ రెస్ట్ బ్యాండ్‌ను కట్టేందుకు ఐసీడీఎస్ విభాగానికి చెందిన 60 బృందాలు పలు చోట్ల పని చేస్తున్నాయని తెలిపారు. ఈ బ్యాండ్‌ను కట్టేటప్పుడు, మొబైల్ నంబర్‌తో పిల్లల వివరాలు, తల్లిదండ్రుల వివరాలు QR కోడ్‌లో పొందుపరుస్తున్నామని, ఈ సారి దాదాపు 12 వేల మంది పిల్లలను ట్యాగ్ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

=========================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలలోనే హామీలు నెరవేరుస్తూ... అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేశామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో 25 కోట్ల రూపాయలతో పాలకొల్లు - మార్టేరు ప్రధాన ఆర్ అండ్ బి రహదారి విస్తరణ, నిర్మాణ పనులను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వచ్చే సంక్రాంతి నాటికి గుంతలు లేని ఆంధ్రప్రదేశ్ గా మార్చేందుకు రహదారుల అభివృద్ధి నిధులను ముఖ్యమంత్రి కేటాయించారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 20 సెకన్లు)

విరామం

=========================

దేశంలో టెలీకమ్యూనికేషన్స్ అభివృద్ధి, మొబైల్ టెక్నాలజీ విస్తరణకు పూర్వ ప్రధానమంత్రి అటల్ బీహారి వాజ్‌పేయ్ నాంది పలికారని మిజోరామ్ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. అటల్ బిహారీ వాజ్ పేయి శతజయంతిని పురస్కరించుకుని విశాఖపట్నం నగరంలో ఈ రోజు నిర్వహించిన వేడుకల్లో గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిచ్చి, ఆర్థిక పురోభివృద్ధికి దోహదం చేసిన ఘనత అటల్ బిహారీ వాజ్ పేయికే దక్కుతుందని తెలిపారు. కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై విజయం

సాధించడానికి వాజ్‌పేయి కారణమని, ఆయన హయాంలో నాలుగు మెట్రో నగరాల మధ్య నాలుగు లైన్ల జాతీయ రహదారిని వేశారన్నారు. పరిపాలనాదక్షుడిగా వాజ్ పేయికున్న సమర్థత ఎనలేనిదని కంభంపాటి హరిబాబు పేర్కొంటూ..

(వాయిస్ 40 సెకన్లు)

===========================

భారతరత్న, పూర్వ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ శతజయంతి సందర్భంగా ఢిల్లీలోని 'సదైవ్ అటల్' వద్ద ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర  ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఇతర ప్రముఖులతో కలిసి  ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా  సామాజిక మాధ్యమం వేదికగా ముఖ్యమంత్రి స్పందిస్తూ.. దేశగతిని మార్చిన వాజ్ పేయి దూరదృష్టి కారణంగానే నేడు ప్రపంచ దేశాలతో భారత్ పోటీ పడుతోందని, అన్ని రంగాల్లో వృద్ధి సాధిస్తూ... దేశం సగర్వంగా తలెత్తుకు నిలబడుతోందని పేర్కొన్నారు.

===========================

పశ్చిమ మధ్య – నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం సముద్రంలోనే క్రమంగా బలహీనపడనుందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. దీని ప్రభావం వల్ల రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో చాలా చోట్ల, దక్షిణ కోస్తాలో కొన్ని చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఉత్తర కోస్తాలో 45 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, దక్షిణ కోస్తాలో 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది.

===========================

అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు కారణంగా విజయనగరం జిల్లా తాటిపూడి రిజర్వాయరులో నీటి మట్టం పెరిగి.. గోస్తని నదిలో నీటి ప్రవాహం ఉధృతమవుతున్న నేపథ్యంలో నది పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సూచించారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 297 అడుగులు కాగా.. ప్రస్తుతం 295.40 అడుగులకు నీరు చేరుకుంది. రిజర్వాయరులోకి 450 క్యూసెక్కుల వరద  నీరు చేరుతుండగా.. ఒక గేటు ఎత్తి 350 క్యూసెక్కుల నీరును దిగువకు విడుదల చేస్తున్నారు. దాంతో ప్రాజెక్టు దిగువన ఉన్న గంట్యాడ, జామి, ఎస్.కోట మండలాల్లోని నదీ తీరాన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోరారు.

===========================
===========================